


ఎమ్.హేమలత

# ఎంతవరకీ బంధము

"అరే! సీతా! ఎందుకింతగా బాధ పడ్తావ్! అయినా ఇప్పుడేమయిందని? ఇది రోజూ జరిగే భాగోతమే కదా! ఒక్క చోట సహజీవనం చేస్తున్నప్పుడు ఇటువంటి వాటినెన్నో సర్దుకుపోవాలి. అరుణ్, అరవింద్- వచ్చే టైమయింది. లే...లేచి ముఖం కడుక్కో"

భర్త వెంకట్రావు మాటలకు అతని కేసి తిరస్కారంగా చూసింది సీత.

"ఇదిగో! నేనిలా ఏదయినా అంటే నీకు కోపం వస్తుంది. కానీ నిదానంగా ఆలోచించు"

"ఏంటండీ ఆలోచించేది? అసలు నేనేమన్నానని.. 'ఇది శ్రావణమాసం రోజులు, పూజలూ అవీ ఉంటాయ్. ఇప్పుడే నువ్వు కిట్టీపార్టీ అంటూ హడావిడి చేసి, అవీ, ఇవీ వండకు. అంతగా అయితే నీ మిగతా స్నేహితుల్లాగ ఏ హోటల్లో అయినా ఏర్పాటు చేసుకో' అన్నాను. అందుకు అంత పెద్ద పెద్ద కేకలు పెట్టి, ప్రసాద్‌తో మొరపెట్టుకొని, నన్నో అపరాధిలాగ వాడి ముందు నిలబెడుతుందా?"

సీతకేమని జవాబు చెప్పాలో అర్థం కాలేదు వెంకట్రావుకి.

అసలీ గొడవలకంతా మూల కారణమేంటో వెంకట్రావుకి తెలుసుకానీ సీతకి తెలీదు. కోడలు సుజాతకీ మధ్య తమతో కలిసి ఉండడం కంటకింపుగా ఉంది. పదేళ్లుగా ఉద్యోగరీత్యా, వెంకట్రావు, సీత వైజాగులో ఉండేవారు. వెంకట్రావు రిటైరయ్యాక ఇద్దరూ హైదరాబాద్‌కి తమ ఫ్లాట్‌కి తిరిగి వచ్చేశారు సామాన్లతో సహా. వీళ్లు వచ్చే సమయానికి ప్రసాద్, సుజాతల పిల్లలిద్దరూ చాలా చిన్నవాళ్లు. ఒకడికి మూడేళ్లు, రెండవ వాడికి ఏడాదిన్నర. పెద్దవాళ్లు రావడం ప్రసాద్‌కి, సుజాతకి మొదట్లో చాలా సంతోషాన్ని ఇచ్చిందనడంలో ఏమాత్రం సందేహం లేదు. చిన్నపిల్లలయిన తమ కొడుకుల్ని చూసుకోవడానికి అత్తామామల అవసరం ఉండడంతో, సుజాత జాగ్రత్తగానే గమనించుకుంది. ఆప్యాయంగానే కలిసిపోయింది.

మొదటి అయిదేళ్లు సామరస్యంగా దొర్లిపోయాయి. పిల్లలు కాస్త పెద్దవాళ్లయి, స్వతంత్రంగా వాళ్ల పనులు వాళ్లు చేసుకోగలరన్న ధీమా వచ్చాక, సుజాత ప్రవర్తనలో క్రమేణా మార్పు చోటుచేసుకోసాగింది. తన ఇష్టమొచ్చినట్లు ఉండడానికి అత్తమామలు అడ్డువస్తున్నారన్న భావనే కాక, ఎన్నాళ్లు ఈ ముసలోళ్ల దగ్గర, వీళ్ల అదుపాజ్ఞలలో జీవించడం అన్న భావన కూడా పెరగడం మొదలయింది. కోడలిలో వస్తున్న ఈ మార్పుని వెంకట్రావు గమనిస్తూనే ఉన్నాడు. కొడుకు ప్రసాద్‌కు అంటీముట్టని స్వభావం. అమ్మానాన్నల మీద అతనికి ప్రేమ లేదనలేం కానీ భార్యా విధేయుడు. స్వతహాగా స్తబ్ధుడు, స్వార్థపరుడు కూడా. తన వరకు జరిగిపోతుంటే ఏదీ పట్టనట్టు తప్పించుకు తిరిగే స్వభావం. ఈ అయిదేళ్లలో కొడుకు కోడళ్లలో, అమ్మానాన్నలైన తమ పట్ల, నివురుగప్పిన నిప్పులా రాజుకుంటున్న అవిధేయత, అసంతృప్తి, వెంకట్రావ్ గమనిస్తూనే ఉన్నాడు. కానీ కొంతకాలం 'వేచి చూద్దాం' అన్న ధోరణి అవలంబించి మిన్నకుండిపోయాడు.

పోనుపోనూ, సుజాతలో అధికమవుతున్న నిర్లక్ష్య ధోరణి, అహంకారం, ప్రసాద్ పాటిస్తున్న మౌనం వెంకట్రావుని కొంత బాధపెట్టసాగింది. అనవసరంగా సీత మనస్సు కష్టపెట్టడం, తను బాధపడడం ఎంతవరకు సమంజసం అన్న మీమాంసలో పడ్డాడు వెంకట్రావు. ఈలోగా నిన్నటి రభస.

"ఈ రోజు శ్రావణ మంగళవారం" అంటుంది సీత.

"కావచ్చు... కానీ నాకీ రోజు సెలవు. ఈ రోజే ఇంట్లో కిట్టీపార్టీ పెట్టుకుంటాను" అంటుంది సుజాత. ప్రొద్దుట ఇంట్లో జరుగుతున్న గొడవలతో తనకేం సంబంధం లేదన్నట్లు బయటకి వెళ్లిపోయాడు ప్రసాద్.

చివికి చివికి గాలివానయి, "నాకీ ఇంట్లో కిట్టీపార్టీ అరేంజ్ చేసే అధికారం కూడా లేదు. అప్పుడప్పుడు హెచ్చరిస్తూనే ఉంటుంది మా అమ్మ. అత్తా మామల ఆధీనంలో ఎన్నాళ్లు ఉంటావే మీరు అని. కానీ నేనే అయ్యో పెద్దవాళ్లు అంటూ ఇన్నాళ్లూ సహించాను" అని, నోటికొచ్చినట్లు వాగి, "కిట్టీ లేదు.. పార్టీ లేదు" అంటూ గబగబా అందరికీ మొబైల్ చేసి చెప్పేసి, చకచకా బయటకు వెళ్లిపోయింది సుజాత.

ఇదెక్కడికి దారి తీస్తుందో అన్న ఆలోచనలో పడ్డ వెంకట్రావు, సీతకు నచ్చచెప్పడం తప్ప ఇంకేం చేయలేని పరిస్థితిలో పడ్డాడు. ఇదివరకటి రోజుల్లో అయితే తల్లిదండ్రుల మాట పిల్లలకు శిరోధార్యమయ్యేది. పెద్దవాళ్లు బాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారు. వారేదైనా చెప్తే అది వారి మంచి కోసమే అన్న ఆలోచన ఉండేది. కానీ, ఇప్పటి తరం పిల్లలే పెద్దలకు సుద్దులు చెప్తున్నారు. పెద్దవాళ్లే దోషులన్నట్లు నిర్ధారిస్తున్నారు.

* * *

"తాతయ్యా! నానమ్మ ఎందుకేడుస్తుంది" అంటూ స్కూలు నుంచి అప్పుడే ఇంట్లోకి వచ్చిన పన్నెండేళ్ల అరుణ్ పలకరించేసరికి, సోఫాలో కూచుని, పత్రిక చేతిలో పట్టుకుని జోగుతున్న వెంకట్రావ్,

"ఔనా! నానమ్మ ఏడుస్తుందా? ఛా... ఏదో సీరియల్ సీరియస్‌గా చూస్తూ ఉంటుందిరా! అందులో ఏ పాత్రయినా బాధ పడ్తే తనూ అలాగే బాధ పడుతుంది" అంటూ నవ్వులాట కిందికి తీసుకురాబోయాడు.

"ఏం కాదు! నానమ్మా. అసలు టీవీ చూడ్డంలేదు. డైనింగ్ టేబిల్ దగ్గర కూచుని ఉంది" 'నువ్వన్నీ అబద్ధాలు చెప్తున్నావు' అన్నట్లు చూశాడు అరుణ్ తాతకేసి.

"సరే! సరే! అదేదో కనుక్కుందాం పద. అరవింద్ ఏడిరా? ఇంకా రాలేదా?"


"అరవింద్‌కి క్రికెట్ కోచింగ్ ఉంది తాతయ్యా స్కూల్లో" పుస్తకాల సంచి టేబిల్ మీద గిరాటు వేసి బాత్‌రూంలోకి దూసుకుపోయాడు అరుణ్.

"సీతా! లే. లేచి అరుణ్‌కేదయినా పెట్టు తినడానికి" అన్నాడు వెంకట్రావ్. సీత లేచి వంటింట్లోకెళ్లి వేడివేడి దోశలు వేసి తెచ్చి టేబిల్ మీద పెట్టింది.

"నానమ్మా! చాలా బాగున్నాయి. దోశలు వేడిగా ఉంటేనే బాగుంటాయి అందులో పల్లీపచ్చడితో" లొట్టలేసుకుని తింటున్న మనవణ్ని ఆప్యాయంగా చూస్తూ కూచుంది సీత.

"అమ్మయ్య! వాతావరణం కొంచెం తేలికయింది" నిట్టూర్చాడు వెంకట్రావు.

కానీ వెంకట్రావు ఊహించినట్లు సమస్య అంత టితో సమసిపోలేదు. రుసరుసలాడుతూ ఆఫీసుకి వెళ్లిన సుజాత రాత్రి ఇంటికి రావడం లేదంటూ ప్రసాద్‌కి సెల్ చేసి చెప్పింది. సుజాత అప్పుడప్పుడు ఆఫీసు నుండి




వాళ్లమ్మ గారింటికి వెళ్లి అలా ఉండిపోవడం అలవాటే కాబట్టి ప్రసాద్ కానీ, వెంకట్రావు కానీ ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. అలా వెళ్లిపోయిన సుజాత నాల్గు రోజులైనా పుట్టింటి నుండి తిరిగి రాకుండా ప్రసాద్ చేత బట్టలు తెప్పించుకొని అటే ఆఫీసుకెళ్లడం, ప్రసాద్ కూడా మౌనంగా ఉండడం వెంకట్రావ్‌కి సీతకి ఏమాత్రం కొరుకుడు పడలేదు.

ఉండబట్టలేక ఓ రోజు వెంకట్రావు "ఏంరా! సుజాత ఎప్పుడొస్తుంది?" అని అడిగితే,

"వస్తుందిలే. ఇప్పుడేమయింది" అని విసుక్కున్నాడు ప్రసాద్. అరుణ్, అరవింద్‌లు యధాప్రకారం స్కూలు కెళ్తున్నారు. తిరిగి ఇంటికొస్తున్నారు అమ్మ అలా వాళ్లను వదిలిపెట్టి అమ్మమ్మ వాళ్లింట్లో ఉండిపోవడం వాళ్లకి అలవాటే.

వారం రోజులు తిరిగిపోయాయ్. కోడలు ఏదో ఉద్దేశంతోనే వాళ్లమ్మగారింట్లో ఉండిపోయిందని గ్రహించాడు వెంకట్రావు. ఓ సాయంత్రం కొడుకు ఆఫీసు నుండి వచ్చాక నిలదీశాడు వెంకట్రావు. సుజాత ఎన్నాళ్లలా అక్కడే అమ్మగారింట్లో ఉంటుందని వెంకట్రావు గట్టిగా అడగడంతో బయటపెట్టాడు ప్రసాద్ అసలు విషయాన్ని.

"నాన్నా! మేమిక్కడ మీతో కలిసి ఉండడం ఇక ఏమాత్రం కుదరని విషయం. రోజూ తగాదాలు, ఘర్షణలు పడడం, సుజాతా అమ్మా ఇద్దరూ బాధపడడం నాకిష్టం లేదు. మా ఆఫీసు దగ్గరే ఒక కొత్త ఫ్లాటు చూసుకున్నాం.



అందులోకి షిఫ్ట్ అయిపోతున్నాం" నిష్కర్షగా, నిర్ద్వంద్వంగా చెప్తున్న కొడుకుకేసి అలా చూస్తూ ఉండిపోయాడు వెంకట్రావు.

దిగ్భ్రాంతి నుండి తేరుకున్న వెంకట్రావ్ "అయ్యో అయ్యో! అదేంరా" అంటున్న సీతను,

"నువ్వూర్కో" అంటూ వారించి, "అలాగా! మంచిది నాయనా! మీ అమ్మ బాధపడడం అన్న విషయం పక్కన పెట్టు. నేనింకా బ్రతికే ఉన్నాను. మీ అమ్మ బాధపడకుండా చూసుకోవడం ఎలాగో నాకు తెలుసు" గంభీరంగా అంటూ ఆ ప్రస్థావనని అక్కడితో తుంచేశాడు.

సీత మాత్రం "వాళ్లిద్దరూ ఆఫీసుకెళ్లిపోతే పిల్లల్ని ఎవరు చూస్తారు? అందులో ఆఫీసు దగ్గర ఇల్లంటే పిల్లల స్కూల్‌కి దూరమైపోదూ" అంటూ బాధపడింది.

"పిచ్చి సీతా! ఎంత అమాయకురాలివి. పిల్లలిద్దరూ పెద్దవాళ్లయ్యారు. వాళ్ల సంగతి వాళ్లు చూసుకునే వయసొచ్చింది పిల్లలకి. అయినా వాళ్ల తల్లిదండ్రులకు లేని ఆలోచన నీకెందుకు" అంటూ సమాధానపరిచాడు.

★ ★ ★

ప్రసాద్ తాము వేరుపోతున్నామని వెంకట్రావుకి తెగేసి చెప్పిన మరుసటి దినం సుజాత ఏమీ జరగనట్లు ఇంటికి వచ్చేసింది. వెంకట్రావుకు సీతకు మాత్రం సుజాత చేష్టలకు మనస్సులు విరిగిపోయాయి. వెంకట్రావు గుంభనంగా ఉండిపోయాడు. సీత మాత్రం అప్పుడప్పుడు "నానమ్మా! నానమ్మా" అంటూ తన చుట్టూ తిరిగే మనవల్ని చూసి "అయ్యో! ఇక పిల్లలు లేకుండా ఎలా ఉండడం" అనుకుంటూ బాధపడేది.


ఒక వారం రోజులు సుజాత, ప్రసాద్‌లు సెలవు పెట్టారు. సామాన్లు ప్యాక్ చేయడం మొదలెట్టారు. ఆ రోజు ఆదివారం కావడంతో అరుణ్, అరవింద్‌లు ఇంట్లోనే ఉన్నారు. పన్నెండేళ్ల అరుణ్ కన్నా పదేళ్ల అరవింద్‌కి తాత, నానమ్మల దగ్గర మాలిమి ఎక్కువ. అరుణ్‌కి కొంతవరకు అర్థమైంది. అమ్మానాన్నలు వేరే ఇంటికి షిఫ్ట్ అవుతున్నారని, పాతొక రోత-కొత్తొక వింత. కొత్త

ఇల్లు అని వినగానే బోల్డు సంతోషపడిపోయాడు అరవింద్. "నాన్నా! నానమ్మా, తాతయ్యల బీరువాలు, పుస్తకాల షెల్ఫ్‌లు అన్నీ కూడా సర్దాలి కదా! తాతయ్యా! మీరు కూడా అన్నీ సర్దుకోండి" అన్నాడు.

"లేదురా! మేము రావడం లేదు. ఈ ఇంట్లో ఇక్కడే ఉండి పోతున్నాము" అన్నాడు వెంకట్రావు, అరవింద్‌ని దగ్గరికి తీసుకుంటూ.

"ఎందుకు?" అమాయకంగా అన్నాడు అరవింద్.

"ఇది మా ఇల్లురా. మీరు మీ ఇంటికి వెళ్తున్నారు" కొంచెం కటువుగానే అన్నాడు వెంకట్రావు. అక్కడే ఉన్న కొడుకు చెవిలో పడే విధంగా.




"మా ఇల్లు-మీ ఇల్లు? అన్నయ్యా! తాతయ్యా ఏంటో అంటున్నారు" అరుణ్ దగ్గరకి పరుగెత్తాడు, అరవింద్.

నిదానంగా హోంవర్క్ చేస్కుంటున్న అరుణ్ "నిజమే! అరవింద్! అమ్మా నాన్నలు వాళ్లింటికి వెళ్తున్నారు" అన్నాడు.

"మరి మనం?" దిగాలుగా అన్నాడు అరవింద్.

అరవింద్‌కి పాపం ఏమీ పాలుపోవడం లేదు.

అటుగా వచ్చిన సుజాత, "అరుణ్! నీకెప్పుడనంగ చెప్పానా- నీ పుస్తకాలు, తమ్ముడివీ త్వరగా సర్దమని. ఇంకాస్సేపట్లో సామాన్లు తీసుకెళ్లేందుకు ప్యాకర్స్ అండ్ మూవర్స్ వ్యాన్ వస్తుంది" అంది కొంచెం కోపంగా.

"చెప్పావు కానీ అమ్మా! నేను మాత్రం రావడం లేదు" అన్నాడు, అరుణ్ పుస్తకంలోంచి తలెత్తకుండానే.

"అన్నయ్య రాకుంటే నేనూ రాను" అంటూ అరుణ్ని కావలించుకున్నట్లు కూచుండిపోయాడు అరవింద్.

పిల్లల మాటలకి ఖంగుతిన్న సుజాత "చూశారా! చూశారా! నేను చెప్తే మీరు నమ్మలేదు. పిల్లల్ని మాయచేసి, మన మాటల్ని విననీయకుండా చేశారు, మీ అమ్మా నాన్నలు" అంది.

"ఏంట్రా అంటున్నావు? వేలెడంత లేవు. మేము మీతో రావడం లేదంటూ ఎంత ధైర్యంగా చెప్తున్నావు! మీ నిర్ణయాలు మీరే తీసుకునేంత పెద్దవాళ్లయిపోయారా?" కోపంగా కొట్టడానికి వస్తున్న తండ్రికేసి తలెత్తి చూశాడు అరుణ్, నదురు బెదురు లేకుండా.


"ప్రసాద్! పిల్లల్ని ఏమీ అనకు. ఏదో తెలీక అలా అంటున్నారు. నాన్నా! అరుణ్! తప్పురా. పెద్దవాళ్లయిన మీ అమ్మానాన్నలు ఎలా చెప్తే అలా నడుచుకోవాలి. వాళ్లు మిమ్మల్ని విడిచిపెట్టి ఎలా వెళ్తార్రా? మిమ్మల్ని చూడకుండా ఎలా ఉండగల్రా?"

"అలాగా తాతయ్యా! అయితే, మా అమ్మా నాన్నా కూడా, అందరికన్నా పెద్దవాళ్లయిన మీరు చెప్పినట్లు నడుచుకోవాలి కదా! మీరు మాత్రం మీ కొడుకుని మా నాన్నని చూడకుండా ఉండగలరా తాతయ్యా!"

అన్నయ్య అరుణ్ మాటల్లోని వాస్తవ పరిస్థితిని కొంత వరకు అర్థం చేసుకున్న అరవింద్, "అమ్మో! నానమ్మ, తాతయ్య లేకుండా నేనసలు ఉండలేను" అంటూ సీతను అతుక్కుపోయి కూచున్నాడు.

చిన్నపిల్లల మాటలకు, చేష్టలకు సమాధానం వెతుక్కుంటూ 'పెద్దలు' నిశ్చేష్టులయ్యారు.

గేటు బయట ప్యాకర్స్ అండ్ మూవర్స్ వారి హారన్ మోగుతూనే ఉంది.



# బావగారితో మరదలు

సల్మాన్ ఖాన్ తమ్ముళ్లు అర్బాజ్ ఖాన్, సోహెయిల్ ఖాన్‌లు కూడా బాలీవుడ్ నటులన్న సంగతి తెలుసు కదా. అర్బాజ్ భార్య మలైకా అరోరా మోడలింగ్‌తోపాటు, హిందీ చిత్రాల్లో ఎక్కువగా ఐటమ్ నంబర్లు చేస్తుంటుంది. ఇన్నాళ్లకి ఆమె బావగారు సల్మాన్‌తో కొత్త సినిమాలో ఐటమ్ సాంగ్ చేస్తోందిట. అఫ్‌కోర్స్ ఈ సినిమాని సల్మాన్ సోదరుడు సోహెయిల్ తీస్తున్నాడు. 'ఛయ్యా ఛయ్యా' ఫేమ్ మలైకా బావగారితో ఎలాంటి హిట్ చిందులేస్తుందో చూద్దాం!